సాక్షి
వికారాబాద్

బుధవారం ￭ 8 ￭ ఫిబ్రవరి ￭ 2023



పల్లెజనం అమ్మ..

దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని ఏర్పాట్లు చేశారు. 8లో▸



క్రీడాప్రాంగణాలు బోర్డులతో సరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాలు ప్రారంభ సమయంలో ఏర్పాటు చేసిన బోర్డుల దశ దాటడం లేదు. 8లో▸



సంక్షేమం పట్టని అధికారులు

సమస్యల పరిష్కారానికి అధికారులు ఏ మాత్రం సహకరించడం లేదని దౌల్తాబాద్ మండల సమావేశంలో సభ్యులు మండిపడ్డారు. 9లో▸

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆనంద్



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు

అనంతగిరి: బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్ నారాయణ్‌రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్య పోస్టుల భర్తీకి చర్యలు



పాల్వాన్‌కుమార్

అనంతగిరి: జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం కింద ఖాళీగా ఉన్న తొమ్మిది మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి పాల్వాన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు గాను అర్హులైన అభ్యర్థులు ఈనెల 8 నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నోటిఫికేషన్, మార్గదర్శకాలు, దరఖాస్తు ఫారాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్ వికారాబాద్.తెలంగాణ, జీఓవీ.ఇన్‌లో పొందుపరిచామన్నారు. మెడికల్ ఆఫీసర్ ఆయుర్వేద (బీఏఎంఎస్)-5, హోమియోపతి (బీహెచ్‌ఎంఎస్) మెడికల్ ఆఫీసర్-3, మెడికల్ ఆఫీసర్ నెచురోపతి(బీఎన్‌వైఎస్)-ఒకటి ఖాళీగా ఉందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ గ్రేడ్



ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కొడంగల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర బృందం బీ గ్రేడు ప్రకటించింది. ఈనెల 2, 3వ తేదీల్లో కేంద్ర బృందం (న్యాక్) సభ్యులు కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాలలో తరగతుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, కంప్యూటర్ విద్య తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ సిబ్‌నాథ్ చైర్మన్‌గా, కేరళ రాష్ట్రానికి చెందిన యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ యాకూబ్, దయానంద్‌సాగర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ సునీల్ మోరే సభ్యులుగా ఉన్న బృందం కొడంగల్‌కు వచ్చింది. కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు విద్య తదితర అంశాలను పరిశీలించారు. వారు సంతృప్తి వ్యక్తం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా కళాశాలకు బీ గ్రేడ్‌ను ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు నిధులు రానున్నాయి. దీంతో కళాశాల విద్యార్థులు అధ్యాపకులతో కలిసి వేడుకలు చేసుకున్నారు.

హరీశ్ పద్దు మేడిపండును తలపిస్తోంది

పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్



తాండూరు: ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ మేడిపండును తలపించేలా ఉందని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్ అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు అంకెలను పెంచి గారడీ చేశారన్నారు. గతంలో అనేక సార్లు చెప్పిందే ఈ బడ్జెట్‌లో ఉందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని పలు ప్రాంతాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారని, అయితే ప్రభుత్వం మాత్రం వెలుగులు, జిలుగులు అంటు గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా 60 శాతం ఉన్నా కేటాయింపుల్లో శీతకన్ను చూపించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో 16 లక్షల మంది రైతులు బ్యాంకులలో డిఫాల్టర్ జాబితాలో చేరారన్నారు.

అధికారులు అటెన్షన్!

కొత్త కలెక్టర్ నారాయణ్‌రెడ్డి వచ్చీ రాగానే ప్రక్షాళన ప్రారంభించారు. కింది స్థాయి నుంచి కలెక్టరేట్ వరకు మార్పులకు నాంది పలికారు. ఈ నేపథ్యంలో పనిచేయకుండా తప్పించుకుని తిరిగే అధికారుల్లో వణుకు మొదలైంది. కలెక్టరేట్‌లో బయోమెట్రిక్, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలుచేపడుతున్నారు. బయోమెట్రిక్ హాజరు ఆధారంగానే వేతనాలంటూ హెచ్చరికలు సైతం జారీ చేశారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారిని ఆప్యాయంగా కలుస్తూనే మరోవైపు అధికారులతో సమీక్ష సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పాలనను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నారాయణ్‌రెడ్డి

కొత్త కలెక్టర్ రాకతో పాలన వేగిరం

- వచ్చీరావడంతోనే ప్రక్షాళన షురూ..
- కలెక్టరేట్ నుంచే మార్పులకు నాంది
- బయోమెట్రిక్, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- నమోదైన హాజరు ఆధారంగానే వేతనాలని హెచ్చరిక
- ధరణి సమస్యలపై ప్రత్యేక దృష్టి
- ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ధరణి హెల్ప్ డెస్క్

వికారాబాద్: బాధ్యతలు చేపట్టిన కొత్త కలెక్టర్.. జిల్లాకు గుండెకాయ వంటి కలెక్టరేట్ నుంచే మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాలసీ మ్యాటర్స్, కోర్టుల్లో ఉన్న వ్యాజ్యాలు మినహా మనం చేయగలిగిన సమస్యల్లో ఏ ఒక్కటీ పెండింగ్ లేకుండా పనిచేద్దామని మూడు ముక్కల్లో అధికారులకు చెప్పేశారు. ఇలా వచ్చీ రాగానే తన ముద్ర స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపడుతున్నారు.

కలెక్టరేట్ నుంచే..

కలెక్టరేట్‌లో రెండు మూడు రోజుల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అంతేకాకుండా బయోమెట్రిక్ హాజరు డీటీఓకు పంపి దాని ఆధారంగానే వేతనాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. దీంతో అధికారుల్లో వణుకు మొదలయ్యింది. కలెక్టరేట్ బయట సైతం సిస్టమ్ మార్చేశారు. గతంలో పార్కింగ్ కూడా పట్టించుకోకుండా అడ్డదిడ్డంగా వాహనాలు కార్యాలయం ఎదుట, రోడ్డుపైనే నిలిపే వారు. పార్కింగ్‌ను హెలీప్యాడ్ వైపు ఏర్పాటు చేసి కార్యాలయం ముందు భాగం గజిబిజి లేకుండా చేశారు.

ధరణి హెల్ప్‌లైన్



కలెక్టర్ ఆదేశంతో మంగళవారం పరిగిలో ధరణి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన అధికారులు

జిల్లాలో మొత్తం 67,000 పైచిలుకు ధరణి దరఖాస్తులు నమోదుకాగా ఇందులో 62వేల పైగా దరఖాస్తులు పరిష్కరించామని గత కలెక్టర్ ప్రకటించారు. అయితే పరిష్కరించామని చెబుతున్న వాటిలో ఎక్కువ శాతం రిజెక్టయిన దరఖాస్తులే ఉన్నాయి. దీంతో ఆ రైతులందరూ తిరిగి మీ సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేస్తుండటంతో జిల్లాలో ధరణి సమస్యలు పేరుకుపోతూనే ఉ న్నాయి. ఏడాది కాలంగా కలెక్టరేట్ మొదలుకుని జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటూ వస్తోంది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ నారాయణ్‌రెడ్డి పరిస్థితిని చక్క దిద్దేందుకు చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యల పరిష్కారం కోసం, అవగాహన కల్పించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. విషయం అందరికీ తెలిసేలా ఓ అధికారిని నియమించి బ్యానర్ల ద్వారా, మీడియా ద్వారా ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రతి రోజు 20 వరకు ధరణి సమస్యల స్వీకరణ, ప్రతి సోమవారం మండలాల్లో ప్రజావాణి ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ కార్యాలయాల్లో మంగళవారం ధరణి హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు కూడా చకచకా జరిగిపోయింది.



ఎంపీపీ సమక్షంలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న సర్పంచ్

ఏడు యూనిట్లు.. 258 దరఖాస్తులు

- లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- తీవ్ర నిరాశలో మైనార్టీలు

యాలాల: దాదాపు తొమ్మిదేళ్ల తరువాత మంజూరు చేసిన మైనార్టీ కార్పొరేషన్ రుణాల యూనిట్ల కేటాయింపుపై మైనార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాలులో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను లాటరీ పద్ధతి ద్వారా నిర్వహించారు. మండల పరిధిలో మొత్తం 37 పంచాయతీలు ఉండగా, కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో 258 మంది మైనార్టీలు దరఖాస్తులు చేసుకున్నారు. రూ.లక్ష రుణానికి 80శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు లోన్, రూ.2లక్షల యూనిట్‌కు 1.60లక్షల సబ్సిడీ, రూ.40వేల బ్యాంకులోన్ సౌకర్యంతో మైనార్టీలకు కార్పొరేషన్ రుణాలు అందిస్తున్నారు. ఎన్నో ఆశలతో పేద, మధ్య తరగతికి చెందిన వారు దరఖాస్తు చేసుకోగా, యాలాల మండలానికి రూ.లక్ష యూనిట్లు 5, రూ.2లక్షల యూనిట్లు రెండు మంజూరు అయ్యాయని మండల పరిషత్ అధికారులు పేర్కొనడంతో తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన, ఎంపీడీఓ పుష్పలీల సమక్షంలో లాటరీ పద్ధతిలో ఏడుగురిని ఎంపిక చేశారు. ఈ ప్రక్రియ బాగానే జరిగినప్పటికీ మైనార్టీ యువకులు మాత్రం తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్ల తరువాత మైనార్టీ కార్పొరేషన్ రుణాలు వచ్చాయని, గ్రామానికి కనీసం ఐదు చొప్పున యూనిట్లు మంజూరు చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం పెద్దేముల్ మండలంలో మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల లక్కీడ్రా ద్వారా నిర్వహించే ఎంపికను వ్యతిరేకిస్తూ బహిష్కరించారు. లక్కీ డ్రా ద్వారా రుణాల ఎంపిక ప్రక్రియను శాంతియుతంగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎంపిక ప్రక్రియపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాకు ఫోన్‌చేసి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కృష్ణయ్యగౌడ్, మధుసూదన్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రాధిక, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

సురక్షిత ప్రయాణం అందరి బాధ్యత



కోఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

- ప్రమాదాల నివారణే లక్ష్యం కావాలి
- ఎస్పీ కోటిరెడ్డి
- ఆర్టీఏ, ఆర్టీసీ, పోలీసు అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం

అనంతగిరి: ప్రజల సురక్షితమైన ప్రయాణం అందరి బాధ్యత కావాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆర్టీఏ, ఆర్టీసీ, పోలీసు అధికారుతో కోఆర్డినేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో వాహనదారులు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. ఆర్టీసీ వాహనాలు నిలిచే జంక్షన్లలో ప్రైవేట్ ప్యాసింజర్ వాహనాలు నిలిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యాలకు చేర్చాలన్నారు. ఆర్టీఏ అధికారులు నిరంతరం వాహనాలపై నిఘా పెట్టాలని, నిబంధనలు పాటించకుండా నడిపే వాహనాలపైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అన్ని శాఖలకు అందుబాటులో ఉంటుందన్నారు. అధికారులు ఒకరితో ఒకరు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రయాణాలు సురక్షితంగా జరగాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు, ఆర్టీఏ, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణకు పైసల్లేవ్

సర్పంచ్‌ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

బంట్వారం: ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ గ్రాంట్ నెలల తరబడి నిలిపి వేయడంతో గ్రామ పంచాయతీల నిర్వహణ భారంగా మారిందని మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాలసోమారం, సుల్తాన్‌పూర్, తొర్మామిడి, మద్వాపూర్ సర్పంచ్‌లు నర్సింహరెడ్డి, బర్కత్‌పల్లి నర్సింహులు, స్ఫూర్తి, గోవింద్‌రెడ్డి మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నుంచి 10 నెలలుగా డబ్బులు రావడం లేదన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితిల్లో గ్రామ పంచాయతీ వర్కర్లకు జీతాలు కూడా చెల్లించ డం లేదన్నారు. పారిశుద్ధ్య పనులు, వీధిలైట్లు, కరెంటు బిల్లులు చెల్లించడం కష్టంగా మారిందన్నారు. ట్రిజరీలో ఫ్రీజింగ్ సమస్య కూడా తల నొప్పిగా మారిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి గ్రామ పంచాయతీలకు రావాల్సిన గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్‌తో మాట్లాడిన తర్వాతే

నిర్ణయం వెల్లడిస్తా

- కొడంగల్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి
- ఈ నెల 9న జరిగే సమావేశం వాయిదా
- మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన తరువాతే తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనతో మాట్లాడారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సీఎంను వ్యక్తిగతంగా కలిసి తన అభిప్రాయం చెబుతానన్నారు. అందులో భాగంగానే ఈనెల 9వ తేదిన నిర్వహించాల్సిన కార్యకర్తల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. కొడంగల్ బీఆర్‌ఎస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు. తన కుమారుడు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుటుంబానికి బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో తాను ఐదు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో పార్టీ టికెట్ పట్నం నరేందర్‌రెడ్డికి ఇచ్చారని అన్నారు. ఆయన గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించడంతో గెలిపించినట్లు చెప్పారు. 2023 ఎన్నికల్లో తన కుమారుడు, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పోటీలో ఉంటారని అన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు తమ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. తమకు టికెట్ ఇస్తే బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలుస్తామని అన్నారు. లేని పక్షంలో అభిమానులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. సమావేశంలో జయతీర్థచారి, పార్వత్‌రెడ్డి, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ ఆగయా

నిజాం నాటి బస్సులకు పూర్వ వైభవం

- ఫార్ములా- ఫ్రిక్స్ సందర్భంగా ప్రారంభించిన కేటీఆర్
- దశలవారీగా 20 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు
- పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలకు అందుబాటులో



డబుల్ డెక్కర్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎస్ శాంతికుమారి, చిత్రంలో మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: 'అలనాటి చారిత్రక డబుల్ డెక్కర్ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. హైదరాబాద్ అందాలను ఆస్వాదిస్తూ రెండంతస్తుల బస్సుల్లో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి' అంటూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై స్పందించిన మంత్రి కేటీఆర్ ఆ అందమైన అనుభవాన్ని నగరవాసులకు తిరిగి అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే డబుల్ డెక్కర్ బస్సులను రోడ్డెక్కించనున్నట్లు ఆయన అప్పుడే చెప్పారు. ట్విటర్ వేదికగా స్పందించినట్లుగానే పర్యావరణప్రియమైన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను మంగళవారం ఆయన ప్రారంభించారు. నగరవాసులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను, సందర్శకులను సైతం విశేషంగా ఆకట్టుకొనేవిధంగాఉన్న మూడు డబుల్ డెక్కర్ బస్సులను నానక్‌రాంగూడలోని హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయం వద్ద జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఫార్ములా- ఈ ప్రిక్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదభరితంగా పర్యాటక విహారం..

ఫార్ములా- ఈ ప్రిక్స్ సందర్భంగా ప్రారంభించిన డబుల్ డెక్కర్ బస్సులు ప్రస్తుతం రేసింగ్ ట్రాక్ పరిధిలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, పారడైజ్ ,నిజాం కాలేజీ రూట్‌లలో తిరుగుతాయి. మొదటి విడతగా హెచ్ఎండీఏ 6 బస్సులను కొనుగోలు చేయగా ప్రస్తుతం మూడింటిని ప్రవేశపెట్టారు. త్వరలో మరో మూడు బస్సులు రానున్నాయి. దశలవారీగా మొత్తం 20 బస్సులను ప్రవేశపెట్టేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఫార్ములా- ఈ ప్రిక్స్ అనంతరం డబుల్ డెక్కర్ బస్సులను చారిత్రక, వారసత్వ కట్టడాల సర్క్యూట్‌లలో నడుపుతారు. హైదరాబాద్ పర్యాటక స్థలాలను ఈ బస్సుల్లో సందర్శించవచ్చు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు.

ఇదీ నేపథ్యం...

నిజాం కాలంలోనే ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులను ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ 2003 వరకు నడిపింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి జూపార్కు వరకు, అఫ్జల్‌గంజ్ వరకు ఇవి నడిచేవి. సికింద్రాబాద్ నుంచి మెహిదీపట్నం వరకు డబుల్ డెక్కర్‌లు ఉండేవి. నగరవాసులతో పాటు ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆ బస్సులో పయనించేందుకు ఎంతో మక్కువ చూపేవారు. ట్యాంక్‌బండ్ మీదుగా ఇందులో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి. కాలక్రమంలో బస్సుల నిర్వహణ భారంగా మారడంతో వీటికి కాలం చెల్లింది. ఫ్లైఓవర్‌ల కారణంగా కూడా బస్సులు నడపడం కష్టంగా మారింది. మంత్రి కేటీఆర్ చొరవ మేరకు ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో రూపొందించిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్‌లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

ప్రత్యేకతలివీ..

- డబుల్ డెక్కర్ బస్సులో 65 మంది ప్రయాణికులకు అనువైన సీట్లు.
- ఇవి పూర్తిగా విద్యుత్‌తో నడుస్తాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 150 కి.మీ వరకు ప్రయాణం చేయవచ్చు.
- 2 నుంచి రెండున్నర గంటల్లో పూర్తిగా చార్జింగ్ చేయవచ్చు.
- 9.8 మీటర్ల పొడవు, 4.7 మీటర్ల ఎత్తు ఉన్న ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ ఖరీదు రూ.2.16 కోట్లు.

క్లుప్తంగా

11నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్‌లో ఈ నెల 11 నుంచి 12వ తేదీ వరకు జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆ గ్రామ నేతాజీ యువజన సంఘం నేతలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సెల్ నంబర్ 97051 29153, 81868 49552లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. విజేత జట్టుకు 10వేల రూపాయల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

మహాదేవునికి ప్రత్యేక పూజలు



స్వామివారికి నైవేద్యం తెస్తున్న శివస్వాములు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో మంగళవారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శివలింగాన్ని అందంగా అలంకరించి పంచామృత అభిషేకం నిర్వహించారు. మంగళహారతులు ఇచ్చారు. ఉపాధ్యాయుడు శరణ్ ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు

మండలంలోని హస్నాబాద్ శివాలయంలో మాలధారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు.

ఉపాధి కూలీల పేర్లు నిత్యం నమోదు చేయాలి

పీఓ లక్ష్మీదేవి



పెద్దేముల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీఓ లక్ష్మీదేవి

పెద్దేముల్: ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీల పేర్లను ప్రతి రోజూ నేషనల్ మొబైల్ మానటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్ యాప్)లో నమోదు చేయాలని పెద్దేముల్ పీఓ లక్ష్మీదేవి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని పెద్దేముల్, బుద్వారం, మారేపల్లితో పాటు పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులను ప్రారంభించారు. మండలంలో సుమారు 12వేల మంది ఉపాధి కూలీలు ఉండగా మంగళవారం 1100 మంది పనుల్లో పాల్గొన్నారని తెలిపారు. జాబ్ కార్డుకు ఉపాధి కూలి ఆధార్ నంబర్‌ను లింక్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మొఫకంజా కాలేజ్ జట్టు



సిద్దార్థ కాలేజ్ జట్టు ఇబ్రహీంపట్నం



శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

జోరుగా'సాక్షి' ప్రీమియర్ లీగ్



ఘట్‌కేసర్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్-4 (ఎస్పీఎల్) మంగళవారం జోరుగా సాగాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు పోటీ పడుతున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-1

మొదటి మ్యాచ్‌లో మొఫకంజా కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్లీ-ఏ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసి ఓటమి పాలైంది. మొఫకంజా క్రీడాకారుడు అఫాన్ 19 బంతుల్లో 64 పరుగులు చేశాడు.

- రెండో మ్యాచ్‌లో ఎస్వీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 2 వికెకేట్లు కోల్పోయి 178 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అశోకా ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్వీ కళాశాల క్రీడాకారుడు ఎడ్వాన్ 29 బంతుల్లో 100 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో హోలీమేరీ-ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఎల్ఆర్ఐటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మల్లారెడ్డి ఇంజినీరింగ్-ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం-2

- మొదటి మ్యాచ్‌లో వేదా డిగ్రీ-ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి ఓడిపోయింది. వేధా జట్టు క్రీడాకారుడు పవన్ 27 బంతుల్లో 56 పరుగులు, గణేశ్ 17 బంతుల్లో 47 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రగతి డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడవ మ్యాచ్‌లో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో ఆలౌట్‌తో 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసి ఓడిపోయింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఆర్ఈసీ-ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికేట్లు కోల్పోయి 94 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ ఇందు కాలేజ్-బి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి ఓటమి పాలైంది.

బతుకమ్మ ఆటపాటలతో నిరసన

7వ రోజుకు చేరిన పండిట్, పీఈటీల ఉద్యమం



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అనంతగిరి: ప్రస్తుత షెడ్యూల్‌లోనే జీవో 110 అమలు చేయాలని పండిట్, పీఈటీల ఐక్యవేదిక జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట బతుకమ్మలు ఆటపాటలతో నిరసన తెలిపారు. 7 రోజులుగా సహాయ నిరాకరణ ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. భాషా పండితులు దశాబ్దాలుగా వెట్టి చాకిరీ చేస్తున్నారని తెలిపారు. కోర్టు తీర్పునకు లోబడి భాషా పండితులు, పీఈటీలకు ఈ షెడ్యూల్‌లోనే పదోన్నతులు కల్పించాలని కోరారు. సాకులు చెబుతూ అన్యాయం చేయాలని చూస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రతినిధులు వెంకటేశ్వర్లు, ఎజాజ్ అహ్మద్, రఘునాథ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య, రామకృష్ణ, రాజశేఖర్, నర్సింలు, గంగయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



డీజిల్ పోసుకున్న యువకుడు

పరిగి: మల్కాపూర్ శివారులోని మహీంద్ర ట్రాక్టర్ షోరూం వద్ద మంగళవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఓ యువకుడు ట్రాక్టర్, తన ఒంటిపై డిజిల్ పోసుకుని ఆత్మహత్య యత్నించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తాన్‌నగర్‌కు చెందిన అఫ్రోజ్ రెండు నెలల క్రితం మహీంద్ర షోరూంలో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. కొన్ని రోజులకే ట్రాక్టర్ తరచూ పాడువుతోంది. ఈ విషయాన్ని అఫ్రోజ్ పలుమార్లు షోరూం నిర్వాహకులకు తెలిపాడు. అయినా వారు పట్టించుకోకపోవడంతో మనోవేదనకు గురైన ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న సిబ్బంది యువకుడిని అడ్డుకొని డీజిల్ డబ్బాను లాక్కున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమస్య ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని అఫ్రోజ్‌కు పోలీసులు సూచించారు.

బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీలేదు

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

పరిగి: అంకెలగారడీ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం వెంకటయ్య అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 – 24 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 2,90,296 కోట్లతో పేదలకు ఎలాంటి న్యాయం చేకూరదన్నారు. పేదల ఇళ్లు లేక ఇబ్బందులకు గురవుతుంటే బడ్జెట్ చూపకపోవడం సిగ్గుచేటన్నారు. బెంగాల్, త్రిపుర, కేరళలో వామపక్ష ప్రభుత్వాలు ఐదేళ్లలోనే అక్షరాస్యతను సాధించాయని, కానీ మన రాష్ట్రంలో మాత్రం అక్షరాస్యతకు రూ.11,525 కోట్లు చూపడం అంత్యంత హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యానికి నేటికి నిరుపేద కుటుంబాలు దూరంగా ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్యయ్య, రఘురాం, శేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వనదర్శినితో విద్యార్థులకు ప్రయోజనం



ప్రకృతిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అన్యదా సంస్థ సిబ్బంది

అనంతగిరి: ప్రకృతి సంపదను తెలుసుకునేందుకు అటవీ, విద్యా శాఖ, అన్యదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వన దర్శిన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని ఎన్నేపల్లిలో గల సంగం లక్ష్మీబాయి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థినులను అనంతగిరి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడి చెట్లు పక్షుల రకాలు, వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా అన్యదా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రకృతి సంపదను కాపాడుకొని గొప్ప అనుభూతులను పొందాలని విద్యార్థులకు సూచించారు. వన దర్శిని ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. వారం రోజులుగా విద్యార్థులకు చెట్లు, పక్షులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ రమణమ్మ, అన్యదా ఫౌండేషన్ ప్రసాద్, నస్రిన్, ఎస్ఎల్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె జనం అమ్మ.. పోలేపల్లి ఎల్లమ్మ

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- 10న 'సిడె' మహోత్సవం



పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం (మూలవిరాట్టు)

బొంరాస్‌పేట: దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు ఆలయం ముస్తాబైంది. గురువారం నుంచి ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సమ్మక్క, సారక్క జాతర తర్వాత ఇదే అతి పెద్ద వేడుక. ప్రతియేటా ఈ జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుంచి, రాష్ట్రం నలుమూలల నుంచి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. పొరుగు రాష్ట్రాల వారి పూజ కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. మాతృస్వామ్య వ్యవస్థలో మహిళ రాజ్యమేలింది. అందులో మహిళలు విద్య తప్పా అన్ని రంగాల్లో విజ్ఞాన్ని కలిగి ఉన్నారు. ఆ కాలంలో వచ్చే వ్యాధులను నయం చేయడంలో వైద్య జ్ఞానం కలిగినవారు ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మలు. ఊరికి కావలగా ఊరడమ్మ లాంటి వీరనారీమణులందరూ మరణాంతరం గ్రామదేవతలుగా అంతరించారు.

ఎల్లమ్మ పూర్వోత్తరం

400 సంవత్సరాల క్రితం మాట ఇది. ఒక రైతు తన పొలంలో గడెం(గుంటుక)పై బరువు కోసం ఒక పాడవాటి రాయిని పెట్టుకొని పొతం చేస్తుండేవాడు. ఆ గడెంను సాయంత్రం పొలంలో వదిలి ఇంటికి వెళ్లేవాడు. మర్నాడు రైతు పొలానికి వచ్చి చూడగా ఆ రాయి గడెంపై కాకుండా తెచ్చిన స్థలంలో ఉండేది. ఇలా మూడు సార్లు జరిగింది. దీంతో రైతుకు ఆశ్చర్యం కలిగి ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు యత్నించాడు. ఓ రోజు రాత్రి పొలానికి వచ్చాడు. నిద్రపోకుండా తన వేలును కోసుకొని జాగారం చేశాడు. సరిగ్గా అర్ధరాత్రి 12గంటలకు ఆ రాయి గడెంపై నుంచి అందమైన దేవతా రూపం దాల్చింది. తెల్లటి వస్త్రాలతో ధగధగ మెరుస్తూ ఎప్పటిలాగే తన స్థానానికి వచ్చి రాయిగా మారడం గమనించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పి అమ్మవారికి గుడి నిర్మించాడు. అయితే ఈ గుడిని నిర్మించింది దాదాపురం దొరలని, కాదు మాజా యిత్‌పూర్ దొరలని పోలేపల్లి గ్రామ పూర్వీకులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఎల్లమ్మ దేవత నిత్య పూజలందుకుంటూ పేదల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతోంది. 1970లో ఈ ఆలయం దేవాదాయ, ధర్మాదాయ శాఖ గుర్తింపు పొందింది. ఎల్లమ్మ జాతర గురువారం ప్రారంభం కానుంది. జాతర ప్రాంగణంలో దుకాణాలు వెలిశాయి. భక్తుల కోసం తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం గదులను సిద్ధం చేశారు. జాతరలో రంగుల రాట్నాలు, సర్కస్‌లు వెలిశాయి.

అమ్మవారికి కల్లే నైవేద్యం

ఎల్లమ్మకు కల్లే నైవేద్యం. భక్తులు ఉపవాస దీక్ష చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. కల్లుతోనే ఉపవాస దీక్ష విరమిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా సిడె

పోలేపల్లి ఎల్లమ్మ జాతర అనగానే గుర్తుకు వచ్చేది సిడె. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. గతంలో కొన్ని కారణాల వల్ల ఈ ఉత్సవాన్ని నిషేధించారు. జాతరకు భక్తులు తగ్గడంతో గత ఏడాది నుంచి సిడెను నిర్వహిస్తున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో షోలాపూర్ వాసులు చేసే పూజలు ప్రత్యేకంగా నిలుస్తాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలు మోహరించాయి. కర్ణాటక, మహారాష్ట్ర పోలీసులు రానున్నారు.

అమ్మవారికి జరిగే కార్యక్రమాలు

ఈ నెల 9వ తేదీ రాత్రి 10గంటలకు అమ్మవారికి పల్లకీ సేవ, ప్రభోత్సవం, 10న జాతర, సాయంత్రం 4గంటలకు అమ్మవారి సిడె లాగే ఉత్సవం, 11వ తేదీ సాయంత్రం 4గంటలకు రథారోహణం, 12న ప్రత్యేక పూజలు, 13వ తేదీ రాత్రి అమ్మవారి ఊరేగింపు ఉంటుందని ఆలయ మేనేజరు రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేశ్ తెలిపారు. భక్తుల కోసం తాగునీరు, వైద్యం, విద్యుత్, బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు



ప్రతియేటా బ్రహ్మోత్సవాల సమయంలో రేణుకా ఎల్లమ్మ యువజన సంఘాన్ని ఏర్పాటు చేస్తాం. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా. భక్తులకు ఉచితంగా సేవలందిస్తాం.

– బుగ్గప్ప, రేణుకాఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు

రూ. కోటితో ఆలయ అభివృద్ధి



రూ. కోటి ఖర్చు చేసి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాం. దేవాదాయ శాఖ, భక్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం, మండపాలు నిర్మించాం. భక్తుల కోసం విశాలమైన ప్రాంగణం ఏర్పాటు చేశాం. ఆలయ శిఖరాన్ని కొత్త హంగులతో అలంకరించాం.

– వెంకటేశ్, ఆలయ కమిటీ చైర్మన్

మామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం



మామిడి సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

పరిగి: పండ్ల తోటలు, కూరగాయల పంటలు సాగు చేసే రైతులు ఉద్యాన శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని ఆ శాఖ అధికారి వైజయంతి సూచించారు. మంగళవారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన పంట మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మామిడి సాగు అవుతున్నట్లు తెలిపారు. మామిడి పండ్లకు ఈగ ఉధృతంగా పెరిగి కాయలను నాశనం చేస్తుందన్నారు. కాయలు పక్వానికి వచ్చే దశలో వాటిపై గుడ్లు పెట్టి లార్వ కాయలోకి చొచ్చుకు పోతుందన్నారు. దీంతో మాడిని రైతులు అధికంగా నష్టపోతారన్నారు. రైతులు అధికారుల సలహాలు పాటిస్తే పంటను కాపాడుకోవచ్చని అన్నారు. ఉద్యన శాఖ అమలు చేసే కొత్త పంటల ప్రోత్సాహం, పాత తోటల పునరుద్ధరణ, సమీకృత చీడ పీడల నివారణ పథకం, తేనెటీగల పెంపకం వంటి పథకాలకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మండల అధికారులను సంప్రదించాలన్నారు.

వ్యక్తిపై దాడి

దోమ: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తిపై దాడికి పాల్పడమే కాకుండా, అడ్డొచ్చిన కుటుంబ సభ్యులను కొట్టిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు. మండలంలోని ఐనాపూర్‌కు చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీను రెండు నెలల క్రితం లైంగిక దాడికి యత్నించాడు. మహిళ తమ్ముడు శివ అడ్డుకొని శ్రీనును మందలించాడు. దీన్ని మనసులో పెట్టుకున్న శ్రీను అతని స్నేహితుడు నల్ల నర్సింహులుతో కలసి మద్యం తాగి ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళుతున్న శివపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న సదరు మహిళ తల్లితో కలసి అడ్డుకునేందుకు యత్నించారు. శ్రీను వారిపై కూడా దాడి చేశాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తాండూరు టౌన్: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. మంగళవారం ఆయన తాండూరులో నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మహిళలు నేర్చుకుంటున్న డిజైన్ వర్కులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న నైపుణ్యంతో స్వయంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బీఐఆర్ఈడీ కో ఆర్డినేటర్ సత్తయ్య, శిక్షకురాలు సంధ్యారాణి, బీఆర్ఎస్ నాయకులు విష్ణు, లక్ష్మణ్, శుభప్రద్ పటేల్ యువసేన నాయకులు భాను, హరీష్ పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శుభప్రద్ పటేల్

క్రీడాప్రాంగణాలు బోర్డులతో సరి



స్వాగత బోర్డు తప్ప సదుపాయాలు లేని నర్సాపూర్ క్రీడాప్రాంగణం

- పలు జీపీల్లో ప్రారంభం కాని పనులు
- మరి కొన్ని చోట్ల నత్తనడకన..
- ఉన్నచోట్ల సదుపాయాలు నిల్
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం
- వృథా అవుతున్న నిధులు

దౌల్తాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాలు ప్రారంభ సమయంలో ఏర్పాటు చేసిన బోర్డుల దశ దాటడం లేదు. ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి యువతకు క్రీడా నైపుణ్యం అందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వారు రాణించేందుకు దోహదపడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో లోపాల వల్ల ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. అనుకున్న మేర క్రీడాప్రాంగణాలు పూర్తి కాకపోవడంతో ఆటలకు అవకాశం లేకుండా పోతోంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి పంచాయతీలో క్రీడాప్రాంగణం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత పంచాయతీ పాలకవర్గం, అధికారులు ఆసక్తి చూపినా క్రమేపీ వారిలో ఆసక్తి సన్నగిల్లుతూ వచ్చింది. దీంతో దీంతో 33కు గాను 15 మాత్రమే అరకొర వసతులతో పూర్తయ్యాయి. మిగిలిన 18 గ్రామాల్లో స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు.

అరకొర వసతులతోనే..

క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు అనువుగా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పలు వసతులతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. క్రీడా ప్రాంగణంలో స్వాగత బోర్డు, వాలీబాల్, కబడ్డీ కోర్టులు, ఖోఖో, లాంగ్‌జంప్ వంటి వాటి కోసం అనుకూలంగా ఉండేలా ప్రాంగణాల్లో వసతులు కల్పించాలి. అలాగే వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేసుకునేందుకు అవసరమైన సామగ్రిని సమకూర్చాలి. కానీ క్రీడాప్రాంగణాల్లో ఇవేమీ కనిపించడంలేదు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో స్వాగత బోర్డులు ఏర్పాటు చేసి వాలీబాల్, ఖోఖో పోల్స్ అమర్చి మమా అనిపించారు.

క్రీడాప్రాంగణాలకు స్థల సమస్య



గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేకపోవడంతో క్రీడాప్రాంగణాల నిర్మాణం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భూ సమస్యలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం. త్వరితగతిన సమస్య పరిష్కరించి గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రంజిత్ కుమార్, ఏపీఓ, దౌల్తాబాద్

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి



ప్రజావేదికలో పాల్గొన్న అడిషనల్ డీఆర్‌డీఓ, అధికారులు

బంట్వారం: ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా జరగాలని అడిషనల్ డీఆర్‌డీఓ స్టీవెనీల్ సూచించారు. 2020 నవంబర్ నుంచి మార్చి 2022 వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ జరిపి మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంట్వారం మండలంలో 2020–2022 మధ్య ఉపాధి హామీ పథకం కింద రూ. 9.51 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి ఆడిట్ బృందం గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. అంతకుముందు ఆడిటర్లు ప్రజావేదికలో గ్రామాల వారీగా నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, సూపరింటెండెంట్ షిండే, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, సర్పంచులు నర్సింహారెడ్డి, స్ఫూర్తి, మహిపాల్‌రెడ్డి, లావణ్య, బర్కత్‌పల్లి నర్సింలు, గోవిందరెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.